


# షూట్ చేసే రోబో డాగ్స్!

**అభివృద్ధి చేసిన చైనా**

బీజింగ్: యుద్ధాల కోసం చైనా సరికొత్త వ్యూహాలను సిద్ధం చేస్తున్నది. కాల్పులు జరుపగల రోబో శునకాలను అభివృద్ధి చేస్తున్నది. ఈ రోబో కుక్కలు పెద్ద ఎత్తున కాల్పులు జరపగలవని చైనా మిలిటరీ చెప్తున్నది. వీటి చేత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌కు డిస్కస్‌ను తీసుకెళ్లడం వంటి చిన్న చిన్న పనులను చేయిస్తున్నది. అయితే ఇదంతా ప్రచార ఆర్భాటమేనని విమర్శకులు చెప్తున్నారు. ఈ రోబో కుక్కల నిర్మాణ శైలిని బట్టి, అవి ప్రామాణిక ఆయుధాలను తట్టుకునేందుకు తగినవి కావని అంటున్నారు. అవి శిక్షణ పొందిన సైనికుడి మాదిరిగా వేగంగా, కచ్చితత్వంతో కాల్పులు జరపడం అసాధ్యమని చెప్తున్నారు.

# అండర్ టెస్టింగ్ ఏఐ ప్లాట్‌ఫామ్స్‌కు అనుమతి తప్పనిసరి

- లాంచింగ్‌కు ముందు కేంద్రం సమ్మతి తీసుకోవాలి
- అవి చట్టాలకు అతీతం కాదు
- కొత్త ఐటీ నిబంధనలు జారీ



న్యూఢిల్లీ, మార్చి 3: కొత్త ఐటీ నిబంధనల్లో భాగంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ శుక్రవారం రెండో మార్గదర్శకాలు జారీ చేసింది. ట్రైనింగ్ లేదా అండర్ ట్రయల్‌లో ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) మోడల్స్‌ను ప్రారంభించే ముందు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపింది. వినియోగదారుల కోసం ఏఐ ఉత్పత్తులను ప్రవేశపెడుతున్నప్పుడు కంపెనీలు చాలా జాగ్రత్తగా ఉండాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సూచించారు. అండర్ టెస్టింగ్ ఉత్పత్తులు చట్టాలకు, ముఖ్యంగా నేర చట్టాలకు అతీతం కాదని స్పష్టం చేశారు. తమ ఉత్పత్తులు టెస్టింగ్‌లో ఉన్న విషయం కస్టమర్లకు తెలియజేయాలన్నారు. 'కన్సెంట్ పాప్‌అప్' మెకానిజాన్ని ఉపయోగించి ఏఐ ఉత్పత్తుల అవిశ్వసనీయత గురించి కస్టమర్‌కు ముందుగానే తెలియాజేయాలని కేంద్ర ఐటీ శాఖ అడ్వైజరీ నోట్ తెలిపింది. 'ఏఐ నమూనాలు, ఎల్‌ఎల్‌ఎమ్(సుదీర్ఘ భాష విధానం), జనరేటివ్ ఏఐ, సాఫ్ట్‌వేర్లు, అల్గారిథమ్స్ వాడే సంస్థలు వారి కంప్యూటర్ వనరుల ద్వారా యూజర్లు చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్రదర్శించడం, ప్రచురించడం, బదిలీ చేయడం, నిల్వ చేయడం, అప్‌డేట్ చేయడం, పంచుకోవడం చేయకుండా చేయాలి' అని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలగకుండా కంప్యూటర్ వనరులను కాపాడుకోవాలని కంపెనీలకు ఐటీ శాఖ సూచించింది. చట్టవిరుద్ధ, అనైతిక సమాచారాన్ని డీప్‌ఫేక్ వంటి వాటికి వాడుకుంటారనే విషయాన్ని యూజర్లకు తెలియజేయాలని ఐటీ శాఖ కోరింది. తాజా నిబంధలన అమలుకు సంబంధించి 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను తమ శాఖకు సమర్పించాలని ఏఐ సంస్థలను కోరింది.



## చలికి వెరువక.. పోటీకి పోటెత్తి..

ఎముకలు కొరికే చలిని లెక్క చేయకుండా చీమల దండులా తరలి వచ్చిన వీళ్లంతా స్నో స్కేటింగ్ స్కి క్లాసిక్ రేస్‌లో పాల్గొన్న పోటీదారులు. ఆదివారం స్వీడన్‌లోని సాలెన్‌లో గల వసాలోప్పెట్‌లో ఈ పోటీలు జరిగాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా వందలాది మంది ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# 10న దేశవ్యాప్తంగా రైల్ రోకో

- 6న ఢిల్లీకి తరలి రండి
- రైతు సంఘాల పిలుపు




న్యూఢిల్లీ, మార్చి 3: కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు ఇతర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి తరలి రావాలని రైతు నేతలు పిలుపునిచ్చారు. ఇటీవల జరిపిన ఆందోళనలో అసువులు బాసిన రైతు స్వగ్రామం బల్లాహ్‌లో ఆదివారం జరిగిన సభలో రైతు సంఘం నేతలు శర్వాన్ సింగ్ పంధేర్, జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ మాట్లాడారు. ఈ నెల 10న రైతులు దేశవ్యాప్తంగా నాలుగు గంటల పాటు రైల్‌రోకో నిర్వహించాలని పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధనకు రైతులు ఇప్పటివరకు చేస్తున్న ఆందోళనను తామున్న ప్రదేశం నుంచే కొనసాగిస్తూ మరింత ఉద్ధృతం చేయాలన్నారు. ఢిల్లీ చలో మార్చ్‌ని మరింత వ్యాప్తి చేయాలని కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా శంభు, ఖనౌరి సరిహద్దు ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులకు రెండు సంఘాలు మద్దతు ప్రకటిస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు, రైతు కూలీలు ఈ నెల 6న ఢిల్లీకి చేరుకుని రైతుల డిమాండ్లపై నినదించాలని పిలుపునిచ్చాయి. ట్రాక్టర్ ట్రాలీలు, ఇతర వాహనాల ద్వారా ఢిల్లీకి చేరుకోలేని ఇతర రాష్ట్రాల రైతులు రైలు, ఇతర మార్గాల ద్వారా చేరుకోవాలని నేతలు సూచించారు. దీనివల్ల ట్రాక్టర్, ట్రాలీల ప్రవేశానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా పర్వాలేదని అన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి మార్చి 10న మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు దేశ వ్యాప్తంగా రైల్‌రోకోలు నిర్వహించాలన్నారు. పంజాబ్‌లోని పంచాయతీలన్నీ రైతుల ఆందోళనకు తీర్మానం చేయాలని, ప్రతి గ్రామం నుంచి ఒక ట్రాక్టర్ ట్రాలీ ఆందోళన జరుగుతున్న బోర్డర్ పాయింట్‌కు పంపాలని వారు కోరారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

**జవాన్, మావోయిస్టు మృతి**

కొత్తగూడెం క్రైం, మార్చి 3: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనలో ఓ జవాన్, ఓ మావోయిస్టు మృతి చెందారు. కాంకేర్ జిల్లా పకంజూర్‌లోని హిటూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందని సమాచారం అందుకున్న బస్తర్ ఫైటర్స్, డీఆర్జీ బలగాలు ఆదివారం సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. జవాన్లు అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 40 నిమిషాలకు పైగా భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో రమేశ్ కురేటి అనే జవాన్ మృతదేహంతో పాటు ఓ మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించారు. మృతిచెందిన మావోయిస్టు వివరాలు తెలియాల్సి ఉన్నది.

## పాన్, పొగాకుపై పెరిగిన వ్యయం

న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంలో భారత్‌లో పాన్, పొగాకు, ఇతర మత్తు పదార్థాల వినియోగం బాగా పెరిగిందని, ప్రజలు తమ సంపాదనలో పెద్దమొత్తం వీటికి ఖర్చు చేస్తున్నారని ఒక సర్వే వెల్లడించింది. అదే సమయంలో విద్యపై ఖర్చు తగ్గింది. 2022-23కి సంబంధించి గృహ వినియోగ వ్యయం సర్వే వివరాలను గత వారం విడుదల చేశారు. పాన్, పొగాకుపై ప్రజల ఖర్చు గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా పెరిగిందని సర్వే తెలిపింది. 2011-12లో గ్రామీణ ప్రాంతాల్లో వీటి వినియోగ వ్యయం 3.21 శాతం ఉండగా, 2022-23 నాటికి అది 3.79 శాతానికి పెరిగింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో 1.63% నుంచి 2.43 శాతానికి పెరిగింది. అదే సమయంలో ఈ కాలానికి విద్యపై పెట్టిన వ్యయం పట్టణ ప్రాంతాల్లో 6.9% నుంచి 5.78 శాతానికి, గ్రామీణ ప్రాంతాల్లో 3.49% నుంచి 3.30 శాతానికి తగ్గడం గమనార్హం.

## వాయువేగంతో ప్రాణాలు కాపాడేలా..

**ఎయిర్ అంబులెన్స్‌కు శ్రీకారం**

న్యూఢిల్లీ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని వేగంగా దవాఖానకు తరలించి ప్రాణాలు కాపాడే లక్ష్యంతో పౌర విమానయాన శాఖ ఎయిర్ అంబులెన్సు సేవలను ప్రారంభించింది. హెలికాప్టర్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్(హెచ్‌ఈఎంఎస్) పేరుతో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మొదట రిషికేశ్‌లోని ఎయిమ్స్ దవాఖానలో ఒక ఎయిర్ అంబులెన్స్ పని చేయనుంది. ఇది దేశంలోనే మొట్టమొదటి ఎయిర్ అంబులెన్స్. ఈ హెలికాప్టర్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని వైద్య పరికరాలు ఉంటాయి. ఒక పేషెంట్‌ను 100 నాటికల్ మైళ్ల దూరానికి తరలించేందుకు వీలుగా ఈ ఎయిర్ అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. త్వరలో ఈ సర్వీసును దేశవ్యాప్తంగా విస్తరించాలని పౌర విమానయాన శాఖ భావిస్తున్నది.

## యూపీలో ప్రాణం తీసిన పేపర్ల లీకేజీ

**మనస్తాపంతో అభ్యర్థిని ఆత్మహత్య**

లక్నో, మార్చి 3: యూపీలో పేపర్ల లీకేజీ ఓ అభ్యర్థిని ప్రాణం తీసింది. యూపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు సిద్ధమవుతున్న 22 ఏండ్ల వర్ష మనస్తాపంతో ఫిరోజాబాద్‌లో శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతో కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా కానిస్టేబుల్, ఆర్‌వో/ఏఆర్‌ఓ పరీక్షల పేపర్లు లీకయ్యాయన్న బాధతో వర్ష ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ప్రభుత్వ ఉద్యోగం పొందడంతో వైఫల్యాల కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. కాగా, ఉత్తరప్రదేశ్ ఇంటర్ బోర్డు పరీక్ష పేపర్ల లీక్ కేసులో ప్రధాన అనుమానితుడు వినయ్ చౌదరిని ఆగ్రా పోలీసులు అరెస్ట్ చేశారు.


- **యుద్ధం మిగిల్చిన కడుపుకోత**



*పెండ్లయిన పదేండ్లకు పుట్టిన పండంటి కవలలను యుద్ధం బలితీసుకున్నది. ముద్దులొలికే ఆ చంటిబిడ్డల ఉసురు తీసింది. అమ్మ ఒడి తప్ప మరో ప్రపంచం తెలియని ఆ చిన్నారులు బాంబులకు బలైపోయారు. రక్తపుటేరులో బిడ్డలను, భర్తను చూసిన ఆ మహిళ హృదయం తల్లడిల్లింది. దక్షిణ గాజా స్ట్రిప్‌లోని రఫాలో ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన కవల పిల్లలతో పాటు తండ్రి మరణించాడు. వీరి మృతదేహాలను పట్టుకొని మహిళ రోదించడం స్థానికులను కంటతడి పెట్టించింది.*

చిత్రం

## సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్‌ది భిన్నమైన ఇమేజ్. ఆయనకు దురాభిమానులంటూ ఉండరు. మిగతా హీరోల ఫ్యాన్స్ కూడా వెంకటేశ్ ఫ్యాన్సే. ఆయన్ను అభిమానించని వాళ్లు తెలుగునేలపై ఉండరంటే అతిశయోక్తి కాదు. జయాపజయాలకు అతీతమైన స్టార్‌డమ్ వెంకీది. రీసెంట్‌గా 'సైంధవ్'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన వెంకీ.. తరువాతి ప్రయత్నంగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో కామెడీ ఎంటర్‌టైనర్ చేయనున్నారని విశ్వసనీయ సమాచారం. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తారట. త్వరలో షూటింగ్ మొదలుపెట్టి, సంక్రాంతికి విడుదల చేయాలనే టార్గెట్‌తో ముందుకెళ్తున్నారట దిల్‌రాజు. దానికి తగ్గట్టే 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ని ఈ సినిమాకు ఖరారు చేశారట. ఇటీవలే దిల్‌రాజు ఈ టైటిల్‌ని రిజిస్టర్ చేయించినట్టు తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో ఇద్దరు స్టార్ హీరోలు అతిథి పాత్రలు పోషించనున్నారట. వారెవరో కాదు.. నందమూరి బాలకృష్ణ, రవితేజ. వీరిద్దరినీ ఇప్పటికే అనిల్ రావిపూడి ఒప్పించారని తెలుస్తున్నది. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. ఇదే నిజమైతే.. పక్కా పండగ సినిమాగా ఈ మూవీని అనిల్ తెరకెక్కిస్తారనడంలో ఎలాంటి సందేహంలేదు.

## చిన్ననాటి కల నెరవేరింది



జపాన్ టోక్యోలో రష్మిక సందడి చేస్తున్నారు. అభిమానులతో ఆమె ఇంటరాక్ట్ అవుతూ సరదాసరదాగా గడుపుతున్నారు. అక్కడి నుంచి బాలీవుడ్ మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. ' జపాన్ వెళ్లడం నా చిన్ననాటి కల. ఇన్నాళ్లకు అది నెరవేరింది. ఇక్కడి ఆహారం, వాతావరణం స్వచ్ఛంగా ఉన్నాయి. క్రంచీరోల్ అనిమీ అవార్డ్స్‌లో నేనూ భాగం అవ్వడం గర్వంగా ఉంది. ఇక్కడివారి ప్రవర్తన, వారి మర్యాద నన్ను కట్టిపడేశాయి' అంటూ ఆనందం వ్యక్తం చేసింది రష్మిక. ఇంకా చెబుతూ ' 'పుష్ప' సినిమాకు ఇక్కడ అభిమానులున్నారు. అందుకే.. 'పుష్ప2'ను జపాన్‌లో కూడా విడుదల చేస్తే బావుంటుందనే ఆలోచనలో మా టీమ్ ఉంది. ఆగస్ట్ 15న 'పుష్ప2' విడుదల కానున్న విషయం తెలిసిందే. అదే డేట్‌కే ఇక్కడ కూడా విడుదల కావొచ్చు.' అంటూ క్రేజీ అప్‌డేట్ ఇచ్చేసింది రష్మిక.

## కోరికే లక్ష్యంవైపు నడిపిస్తుంది



గాడ్‌ఫాదర్ లేకుండా స్వయంకృషితో ఎదిగిన నటుడు విజయ్ సేతుపతి. 'జూనియర్ ఆర్టిస్టుగా వచ్చాను. సింగిల్ డైలాగ్ కేరక్టర్లు కూడా చేశాను. ఇప్పుడు హీరోగా చేస్తున్నాను. ఏం చేసినా.. ఎంత ఎదిగినా.. చివరి లక్ష్యం మాత్రం ఒక్కటే. నటుడిగా కొన్నేళ్లపాటు నన్ను ప్రేక్షకులు గుర్తుంచుకోవాలి.' అంటారాయన. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికరంగా మాట్లాడారు విజయ్ సేతుపతి. ' మనం ఒకటి అవ్వాలి అనుకున్నప్పుడు.. ఆ కోరికను బలంగా అనుకోవాలి. మనస్ఫూర్తిగా కోరుకోవాలి. తగిన ప్రయత్నాలు చేయాలి. మన కోరికలో నిజాయితీ ఉంటే, లక్ష్యం సరైనదే అయితే.. ఆ కోరికను తీర్చడానికి దేవుడెప్పుడూ రెడీగా ఉంటాడు. నేను చిన్నప్పట్నుంచీ యాక్టర్ కావాలని కలలు కన్నా. బలంగా కోరుకున్నా. ఆ కోరికే నన్ను లక్ష్యం వైపు నడిపించింది. ఇప్పుడు ఈ స్థాయిలో నిలబెట్టింది. ఒకవేళ మనం అనుకున్నది నెరవేరట్లేదు అంటే, మన ప్రయత్నంలో లోపం ఉన్నట్టే. లక్ష్యంపై మనసు లగ్నం చేయనప్పుడు ప్రకృతికి కూడా సహకరించదు.' అంటూ అద్భుతమైన విషయాలు చెప్పారు విజయ్ సేతుపతి.



## రూమర్లవాళ్లంతా నిశ్శబ్దం అయిపోయారు

ఊళ్లో పెళ్లి జరుగుతుంటే అవేవో హడావిడి పడ్డాయట.. సోషల్ మీడియా పుణ్యమా అని చాలామంది ఇలాగే తయారయ్యారు. రంధ్రాన్వేషణే వీరి జీవన విధానం. ఇటీవల ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన నయనతార.. తన భర్త విఘ్నేష్ శివన్‌ను అనుకోకుండా అన్‌ఫాలో చేసింది. దీంతో ఖాళీగా ఉన్న కొందరు నెటిటజన్స్‌కి పని దొరికింది. నెట్టింట రకరకాల రూమర్లు మొదలుపెట్టారు. కొన్ని మీడియా సంస్థలైతే నయన్ దంపతులు విడిపోతున్నారంటూ ఏకంగా కథనాలే ప్రసారం చేశాయి. దీంతో నయనతార అభిమానులు గందరగోళానికి గురయ్యారు. వాతావరణం వేడిగా మారడంతో నయన్‌కి కల్పించుకోక తప్పలేదు. రూమర్లకు చెక్ పెడుతూ ఇన్‌స్టాలో విఘ్నేష్‌ను ఫాలో అవ్వడం మొదలుపెట్టారు. విఘ్నేష్ కూడా ఆమె ఫొటోను తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు. దీంతో గాలి వార్తలు రాసే రూమర్లవాళ్లంతా నిశ్శబ్దం అయిపోయారు.

## కుటుంబ సమేతంగా షరతులు వర్తిస్తాయి



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా రూపొందిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి(అక్షర) దర్శకుడు. నాగార్జున సామల, శ్రీష్‌కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మాతలు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఈ చిత్రం ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నిర్మాతలుగా పరిశ్రమలో ఎక్కువకాలం కొనసాగాలనేది మా ఆకాంక్ష. అందుకు తొలి అడుగే ఈ సినిమా. ఏషియన్, సురేశ్ ప్రొడక్షన్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు మా సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నాయి. అందరికీ నచ్చే సినిమా అవుతుందని నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాతలు అన్నారు. చక్కటి కథతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో ఉంటాయని, కుటుంబసమేతంగా చూడాల్సిన సినిమా ఇదని, అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, అండగా నిలిచిన మామిడి హరికృష్ణకి కృతజ్ఞతలని దర్శకుడు చెప్పారు. ఇంకా చైతన్యరావు, భూమి శెట్టి, నటుడు సంతోష్ యాదవ్ కూడా మాట్లాడారు.

## లాస్ట్ పంచ్ అదిరిందిగా



తమిళ అగ్ర నటుడు విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తను నటించబోయే 69వ సినిమానే తన ఆఖరి సినిమాగా విజయ్ ప్రకటించారు. మరి ఇంతటి ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకుడెవరు? అనే విషయంపై మీడియాలో పెద్ద చర్చే నడుస్తున్నది. వెట్రిమారన్, లోకేష్ కనకరాజ్‌ల పేర్లు కూడా బాగానే వినిపిస్తున్నాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ ఇప్పుడు కొత్త పేరు వార్తల్లోకొచ్చింది. షారుక్‌ఖాన్‌కి బ్లాక్‌బాస్టర్ 'జవాన్' అందించిన అట్లీ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. విజయ్‌తో అట్లీ చేసిన తేరీ, మెర్సల్, బిగిల్ చిత్రాలు భారీ విజయాలను అందుకొని అట్లీని స్టార్ డైరెక్టర్‌గా నిలబెట్టాయి. ఆ విశ్వాసంతోనే విజయ్‌కోసం అద్భుతమైన కథను తయారు చేశాడట అట్లీ. పూర్తి రాజకీయ నేపథ్యంతో, విజయ్ పొలిటికల్ కెరీర్‌కి కూడా ఉపయోగపడేలా ఈ కథ తయారు చేశాడట అట్లీ. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో మొదలు కానున్నదని సమాచారం. సినిమాకు సంబంధించిన నిర్మాతల వివరాలు తెలియాల్సి వుంది.



## స్వాతంత్ర్యపోరాటం నాటి ప్రేమకథ

కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి జంటగా రూపొందిస్తున్న చిత్రం '1920 భీమునిపట్నం'. నరసింహ నంది దర్శకుడు. కంచర్ల అచ్యుతరావు నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ అధికారి పాత్రలో కంచర్ల ఉపేంద్ర నటిస్తుండగా, స్వాతంత్ర్య సమర యోధుని కుమార్తెగా హీరోయిన్ అపర్ణాదేవి కనిపించనుంది. వీరిద్దరిపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కంచర్ల అచ్యుతరావు క్లాప్ ఇచ్చారు. 'ఇది సీతారాం, సుజాత అనే ఓ జంట ప్రేమకథ. 1920నేపథ్యం కావడంతో ఆ రోజుల్ని గుర్తుచేసే సంగీతం ఉండాలనే ఉద్దేశంతో ఇళయరాజాగారిని కలిశాం. ఆయన కథ విని, 'సినిమా చేస్తున్నాం' అన్నారు. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేస్తాం.' అని నిర్మాత తెలిపారు. స్వాతంత్ర్య పోరాట నేపథ్యంలో చక్కటి భావోద్వేగాల మధ్య నడిచే కథ ఇదని, నిజజీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను ప్రేరణగా తీసుకొని ఈ కథ తయారు చేశానని దర్శకుడు పేర్కొన్నారు. తెలుగు సినిమా స్థాయిని పెంచే సినిమా ఇదని హీరో కంచర్ల ఉపేంద్ర అన్నారు.

## బాలీవుడ్ జేజమ్మ?



అందం.. అంతులేని ఆత్మాభిమానం.. వెరసి దీపిక పదుకోన్. గ్లామర్ పాత్రలే కాక, రాజసంతో కూడిన పాత్రలకు కూడా ఆమె కేరాఫ్ అడ్రస్ అవ్వడానికి కారణం అదే. పద్మావత్, బాజీరావ్ మస్తానీ చిత్రాలే అందుకు నిదర్శనాలు. త్వరలో మరో పవర్‌ఫుల్ పాత్రలో దీపిక కనపడనున్నారు. అది కూడా సాదాసీదా పాత్ర కాదు. తెలుగులో సంచలనాలు సృష్టించిన సినిమాకు చెందిన పాత్ర. ఆ సినిమా ఏంటో.. ఆ పాత్ర ఏంటో తెలుసుకోవాలనుందా!?.. ఆ సినిమా పేరు 'అరుంధతి'. ఆ పాత్ర పేరు 'జేజమ్మ'. అవును.. త్వరలో దీపిక పదుకోన్ జేజమ్మగా బాలీవుడ్ తెరపై మెరవనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా నిశ్శబ్దంగా జరిగిపోతున్నదని ఫిల్మ్ నగర్ టాక్. తెలుగు సినిమాకు చెందిన ఓ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలిసింది. అంతేకాదు, ఈ చిత్రాన్ని తెలుగు దర్శకుడే డైరెక్ట్ చేయనున్నారని సమాచారం. ఈ మధ్య ఓ థ్రిల్లర్ కథతో సూపర్‌హిట్ కొట్టిన దర్శకుడు ఈ సినిమాను డైరెక్ట్ చేస్తాడట. మిగతా వివరాలు తెలియాల్సివుంది.